అమ్మ ఆరోగ్యానికి రక్ష

- ఆరోగ్యవంతమైన సమాజానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి
- గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందజేత
- సత్ఫలితాలనిస్తున్న వైఎస్సార్ సంపూర్ణ పోషణ

గర్భిణులు, బాలింతల ఆరోగ్యం కోసం రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకం సత్ఫలితాలనిస్తోంది. సంక్షేమం, ఆరోగ్యకరమైన సమాజమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం అనేక పథకాలను అమలు చేస్తోంది. ఇందులో భాగంగా బడిఈడు పిల్లల కోసం పాఠశాలల్లో పోషక విలువలతో కూడిన ఆహారం అందిస్తుండగా.. మహిళల ఆరోగ్యానికి అదే తరహాలో కృషి చేస్తోంది. గర్భిణులు, బాలింతలకు వైఎస్సార్ సంపూర్ణ పోషణ ద్వారా పౌష్టిక విలువలతో కూడిన ఆహారాన్ని అందిస్తోంది. తద్వారా ప్రభుత్వ ఆశయం నెరవేరుతోంది. – ఎంవీపీకాలనీ


వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లతో గర్భిణులు, బాలింతలు(ఫైల్)

పేదరికంతో గర్భిణులు సరైన పౌష్టికాహారం తీసుకోకపోవడంతో రక్తహీనతకు గురవుతున్నారు. వారికి పుట్టిన బిడ్డలు ఆరోగ్య సమస్యలతో సతమతమవుతున్నారు. దీనిని గుర్తించిన ప్రభుత్వం తల్లీబిడ్డల ఆరోగ్యం కోసం అదనపు పౌష్టికాహారం అందించాలని నిర్ణయించింది. ఈ క్రమంలో వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకాన్ని అమల్లోకి తెచ్చింది. గర్భిణులకు గతంలో ఇచ్చే పప్పు, పాలు, గుడ్లకు అదనంగా మరిన్ని పోషక పదార్థాలను అందించడంతో వారిలో రక్తహీనత తగ్గుతోంది. ఆరోగ్యవంతమైన శిశువులకు జన్మనిస్తున్నారు. ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారం, టేక్ హోమ్ రేషన్ సదుపాయంపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.

ఐదేళ్లలో రూ.2.95 కోట్లు ఖర్చు

తూర్పు నియోజకవర్గంలో ఈ ఐదేళ్లలో 9,843 మంది గర్భిణులు, బాలింతలకు ప్రభుత్వం రూ.2,95,29,000 ఖర్చు చేసింది. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో కచ్చితత్వంతో ఈ సరకుల సరఫరా జరుగుతోంది. గర్భిణులు, బాలింతల కోసం రెండు కిలోల రాగిపిండి, కిలో అటుకులు, పావు కిలో వేరుశనగ చెక్కి, కిలో జొన్నపిండి, పావు కిలో బెల్లం, పావు కిలో ఎండు ఖర్జూరం, 3 కిలోల బియ్యం, అర కిలో వంటనూనె, కిలో పప్పు, 5 లీటర్ల పాలు, 25 కోడిగుడ్లు అందజేస్తోంది. ప్రతి నెలా అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా టేక్ హోమ్ రేషన్‌గా ఈ సరకులు పంపిణీ చేస్తోంది. దీంతో గర్భిణులు, బాలింతలు రక్తహీనతను అధిగమిస్తున్నారు. దీంతో పాటు 7 నెలల నుంచి 3 ఏళ్ల వయసు గల పిల్లలకు పోషక విలువలతో కూడిన ఆహారాన్ని అందిస్తూ రాష్ట్ర ప్రభుత్వం అందరి మన్ననలు అందుకుంటోంది.

ఐదేళ్లలో వైఎస్సార్ పోషణ లబ్ధిదారులు, సరకుల విలువ పరిశీలిస్తే..

సంవత్సరం	లబ్ధిదారుల సంఖ్య	సరకుల విలువ
2019-20	1923	రూ.57,69,000
2020-21	1950	రూ.58,50,000
2021-22	1984	రూ.59,52,000
2022-23	1992	రూ.59,76,000
2023-24	1994	రూ.59,82,000




వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్

పౌష్టికాహారం.. మెరుగైన విద్యే లక్ష్యం

ప్రధానంగా గర్భిణులు, బాలింతలతో పాటు చిన్నారులకు పౌష్టికాహారం అందించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం వైఎస్సార్ సంపూర్ణ పోషణను అమలు చేస్తోంది. గర్భిణులు, బాలింతలతో పాటు, ప్రతీ విద్యార్థికి పౌష్టికాహారం అందేలా చర్యలు తీసుకుంటున్నాం. ప్రాథమిక పాఠశాలల ఆవరణాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల ఆధునికీకరణ పూర్తయింది. ప్రభుత్వం మంజూరు చేసిన నిధులతో మిగతా అన్ని కేంద్రాల్లో సౌకర్యాలు అందుబాటులోకి తీసుకొస్తాం. ఈ ఐదేళ్లలో తూర్పు నియోజకవర్గానికి చెందిన 9,843 మంది గర్భిణులు, బాలింతలు లబ్ధిపొందారు.

– రమణకుమారి, సీడీపీవో, విశాఖ అర్బన్

అన్ని సౌకర్యాలు బాగున్నాయి

ఎంవీపీకాలనీలోని అంగన్‌వాడీ సెంటర్‌లో సౌకర్యాలన్నీ బాగున్నాయి. చాలా అంగన్‌వాడి కేంద్రాలను ఆధునికీకరించంతో పాటు పూర్తిస్థాయిలో మౌలిక వసతులు కల్పించారు. అన్ని సరకులను సకాలంలో అందజేస్తున్నారు. మాకు ఫోన్లు చేసి సరకులు తీసుకోవాలని సూచిస్తున్నారు. టేక్ హోమ్ రేషన్ ప్రక్రియ చాలా బాగుంది. పోషకాలతో కూడిన ఆహారం ఇవ్వడంతో పాటు ఆరోగ్య పరంగా అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నారు.

– దాట్ల లలితశ్రీ, లబ్ధిదారు

ఐదేళ్లలో చాలా మెరుగయ్యాయి

ఈ ఐదేళ్లలో అంగన్‌వాడీ కేంద్రాల్లో సౌకర్యాలు చాలా మెరుగయ్యాయి. కేంద్రాలు పరిశుభ్రంగా దర్శనమిస్తున్నాయి. తాగునీటి సౌకర్యంతో పాటు మరుగుదొడ్ల సౌకర్యం కూడా కల్పించారు. పిల్లలు ఆహ్లాదకరంగా విద్యను అభ్యసించడంతో పాటు ఇండోర్ క్రీడలు ఆడిస్తున్నారు. గర్భిణులు, బాలింతలకు ప్రభుత్వం పోషక విలువలతో కూడిన ఆహారం అందిస్తోంది. ఆరోగ్య పరంగా ఎలాంటి సమస్యలు తలెత్తడం లేదు.

– కోరాడ మణి, లబ్ధిదారు

ఎంపీ వై.వి.సుబ్బారెడ్డికి ఘన సన్మానం


ఎంపీ వైవీ సుబ్బారెడ్డికి శాలువా కప్పి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎస్‌ఎంయూపీ ప్రతినిధులు

మద్దిలపాలెం: రాజ్యసభ సభ్యుడు, వైఎస్సార్ సీపీ ఉత్తరాంధ్ర రీజినల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డిని సోమవారం ఎస్‌ఎంయూపీ రాష్ట్ర అధ్యక్షుడు పి.వి. రమణారెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వై.శ్రీనివాసరావు ఘనంగా సన్మానించారు. ఆయనకు శాలువా కప్పి.. పుష్పగుచ్ఛం అందజేశారు. రాష్ట్ర కోశాధికారి పి.వి.వి.మోహన్, రాష్ట్ర, జిల్లా జోనల్, రీజినల్, డివిజనల్ నాయకులు, అన్ని డిపోల అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

ఈఎన్‌టీ ఆస్పత్రిలో నూతన పరికరాలు ప్రారంభం


పరికరాలను ప్రారంభిస్తున్న ఏఎంసీ ప్రిన్సిపాల్ ఆచార్య బుచ్చిరాజు

ఏయూక్యాంపస్: ప్రభుత్వ చెవి, ముక్కు, గొంతు(ఈఎన్‌టీ) ఆస్పత్రిలో పీజీ విద్యార్థులకు ఉపయుక్తంగా నిలిచే ఉపకరణాలు అందుబాటులోకి వచ్చాయి. వీటిని ఆంధ్రా మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య బుచ్చిరాజు సోమవారం ప్రారంభించారు. చెవి ఎముక (టెంపోరల్) చికిత్స విధానంపై శిక్షణ అందించే విధంగా ఈ ప్రయోగశాలను ఏర్పాటు చేశారు. రెండు మైక్రోస్కోప్‌లు, వీడియో స్టేషన్లతో ప్రత్యక్షంగా వీక్షించే విధంగా అందుబాటులో ఉంచారు. నిపుణులుగా పీజీ విద్యార్థులను తీర్చిదిద్దడానికి ఈ ప్రయోగశాల ఉపయుక్తంగా నిలుస్తుందని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ హరికృష్ణ తెలిపారు.

క్లుప్తంగా

45 వేల దొంగ ఓట్లతో వెలగపూడి గెలిచారు

- యాదవ సామాజిక వర్గ నేతల ఆరోపణ

ఆరిలోవ: తూర్పు నియోజకవర్గ అసెంబ్లీ టికెట్‌ను అన్ని రాజకీయ పార్టీలు యాదవులకే కేటాయించాలని ఆ సామాజిక వర్గ నాయకులు డిమాండ్ చేశారు. తోటగరువు రాధాకృష్ణ కల్యాణ మండపంలో సోమవారం యాదవ సామాజికవర్గ నాయకులు ఒమ్మి చిన్నారావు, కోడిబోయిన బాబ్జీ, ఎల్లాజీ, భాగ్యానంద విలేకరులతో మాట్లాడారు. నియోజకవర్గంలో ఎక్కువ మంది యాదవ సామాజిక వర్గ ప్రజలు ఉన్నారన్నారు. అందుకే యాదవులకే అన్ని రాజకీయ పార్టీలు టికెట్ కేటాయించాలన్నారు. ప్రస్తుత ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు 45 వేల దొంగ ఓట్లతో గెలిచారని ఆరోపించారు. లేదంటే 2014లో యాదవ సామాజిక వర్గానికి చెందిన వంశీకృష్ణ శ్రీనివాస్, 2019లో అక్కరమాని విజయనిర్మల గెలిచేవారని తెలిపారు. రాజకీయ పార్టీలు ఆలోచించి తూర్పులో యాదవులకే సీట్లు కేటాయించాలని కోరారు.

కాంట్రాక్టర్‌పై గుర్తు తెలియని వ్యక్తుల దాడి

బీచ్‌రోడ్డు: గుర్తు తెలియని వ్యక్తుల దాడిలో ఓ కాంట్రాక్టర్ గాయాలపాలయ్యారు. మూడో పట్టణ పోలీసులు తెలిపిన వివరాలివీ.. సీబీఎం కాంపౌండ్‌కు చెందిన కోరాడ విజయబాబు కాంట్రాక్టర్. ఆదివారం రాత్రి తన పనులు ముగించుకుని కారులో ఇంటికి వెళ్తున్నారు. మధ్యలో ఫోన్ రావడంతో టింపనీ స్కూల్ వద్ద కారు పక్కకు ఆపి మాట్లాడుతున్నారు. ఆ సమయంలో కారులో వచ్చిన నలుగురు వ్యక్తులు అతనిపై దాడి చేసి పరారయ్యారు. ఈ ఘటనలో ఆయనకు తీవ్ర గాయాలయ్యాయి. బాధితుడి ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యార్థుల సస్పెన్షన్

ఏయూక్యాంపస్: అనధికార వ్యక్తులను హాస్టల్‌లోకి అనుమతించిన ఇద్దరు విద్యార్థులను ఏయూ అధికారులు సస్పెండ్ చేశారు. ఆ విద్యార్థులకు అవసరమైన కౌన్సెలింగ్ ఇవ్వడంతో పాటు వారి తల్లిదండ్రులతో మాట్లాడారు. విద్యార్థులు క్రమశిక్షణతో ఉండాలని, ఎటువంటి విద్యేతర కార్యక్రమాల్లో భాగస్వాములు కారాదని ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్ సూచించారు. ఇతరులను హాస్టల్‌లోకి ప్రవేశం కల్పించడం నిబంధనలకు విరుద్ధమన్నారు. కాగా.. ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా అధికారులు చర్యలు చేపట్టారు.

రాష్ట్రాభివృద్ధికి మళ్లీ సీఎంగా జగనే కావాలి


మాట్లాడుతున్న కులిడి సురేష్ బాబు

బీచ్‌రోడ్డు: రాష్ట్ర ప్రజల సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా పాలన అందించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ సీఎం కావాలని డాక్టర్ వైఎస్సార్ మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ కులిడి సురేష్‌బాబు అన్నారు. నగరంలోని ఓ హోటల్‌లో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికీ అందే విధంగా సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చారన్నారు. ఎన్నికల సమయం వచ్చే సరికి పొరుగు రాష్ట్రాల నుంచి రాజకీయ సంచార నాయకులు హడావిడి చేస్తూ.. తప్పుడు సంకేతాలతో లబ్ధిపొందాలని నానా తంటాలు పడుతున్నారన్నారు. వీరంతా పంట పొలాల్లో పెట్టే దిష్టిబొమ్మలుగా ప్రజలు భావిస్తున్నారన్నారు. సామాజిక న్యాయాన్ని సాధికారం చేసిన సీఎం వైఎస్ జగన్.. వ్యక్తి కాదు శక్తి అని సంచార పార్టీల అధ్యక్షులు తెలుసుకోవాలన్నారు. ఉన్నవి లేనట్లుగా లేనివి ఉన్నట్లుగా కథలు చెబుతున్న ప్రతిపక్షాలు.. వేసవి సెలవుల్లో తిరిగి పొరుగు రాష్ట్రానికి వెళ్లిపోవడం ఖాయమన్నారు. ఇటువంటి వారిని తరిమికొట్టాలని ప్రజలకు పిలుపునిచ్చారు. సమావేశంలో నర్సింగరావు, మౌనిక తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రానికి మళ్లీ జగనే ముఖ్యమంత్రి


హనుమంతవాకలో స్థానికులతో మాట్లాడుతున్న ఎంపీ ఎంవీవీ, బొత్స ఝాన్సీ

- ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ


బొత్స ఝాన్సీకి హారతులిస్తున్న మహిళలు

ఆరిలోవ: మళ్లీ రాష్ట్రానికి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డే అని వైఎస్సార్ సీపీ తూర్పు సమన్వయకర్త, విశాఖ ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ అన్నారు. గడపగడపకు మన ప్రభుత్వంలో భాగంగా సోమవారం జీవీఎంసీ 9వ వార్డులో పాదయాత్ర చేపట్టారు. ఎంపీతో పాటు వైఎస్సార్ సీపీ విశాఖ పార్లమెంట్ ఇన్‌చార్జి బొత్స ఝాన్సీ, 9, 12 వార్డుల కార్పొరేటర్లు ఉమ్మడి స్వాతి, అక్కరమాని రోహిణి, నియోజకవర్గ ఎన్నికల పరిశీలకుడు మొల్లి అప్పారావు, స్థానిక నాయకులు హనుమంతవాక, విజయదుర్గాకాలనీ, సంజయ్‌గాంధీ కాలనీ ప్రాంతాల్లో ఇంటింటికీ వెళ్లారు. స్థానికులతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అందుతున్నాయా? వాటి వల్ల పొందే లబ్ధి తదితర అంశాలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఎంపీ ఎంవీవీ మాట్లాడుతూ సంక్షేమ పథకాలతో ప్రజలు సంతోషంతో ఉన్నారన్నారు. గత ప్రభుత్వ హయాంలో నియోజకవర్గంలో ఎలాంటి అభివృద్ధి జరగలేదన్నారు. మూడు సార్లు ఎమ్మెల్యేగా గెలిచిన వెలగపూడి రామకృష్ణబాబు.. నియోజకవర్గ అభివృద్ధిని విడిచిపెట్టి సంక్రాంతి సమయంలో కోడి పందాలపై దృష్టి పెట్టారని ఆరోపించారు. బొత్స ఝాన్సీ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అనేక సంక్షేమ పథకాలు అమలు చేసి పేదల అభివృద్ధికి విశేష కృషి చేశారన్నారు. కోవిడ్ సమయంలో సైతం సంక్షేమ పథకాలను ఆపకుండా ప్రజలకు అందించారన్నారు. ఆయన ఇచ్చిన హామీలన్నింటినీ నెరవేర్చి.. ధైర్యంగా మళ్లీ ఎన్నికలకు వెళుతున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో జరిగిన అభివృద్ధిని దృష్టిలో పెట్టుకుని రానున్న ఎన్నికల్లో మళ్లీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఆశీర్వదించాలని ఆమె కోరారు. రానున్న ఎన్నికల్లో విశాఖలో వైఎస్సార్ సీపీ జెండా ఎగురవేద్దామని పిలుపునిచ్చారు. పలు విభాగాలు డైరెక్టర్లు, వైఎస్సార్ సీపీ స్థానిక నాయకులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఆరిలోవ: విమ్స్‌కు సంబంధించిన సబ్‌స్టేషన్ 33/11 కేవీ పరిధిలో మంగళవారం నిర్వహణ పనులు చేపడుతున్నామని ఈపీడీసీఎల్ జోన్-3 ఈఈ పి.శ్రీనివాసరావు తెలిపారు. దీని కారణంగా ఇందిరానగర్, రాజీవ్‌నగర్, ఆదర్శనగర్, సుందర్ నగర్, రవీంద్రనగర్ ప్రాంతాల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు. ఆయా ప్రాంతాల ప్రజలు విద్యుత్ సిబ్బందికి సహకరించాలని కోరారు.

విద్యతోనే జీవితానికి వెలుగు


అవగాహన కల్పిస్తున్న కృష్ణా కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు

బీచ్‌రోడ్డు: విద్యతోనే జీవితానికి వెలుగు అంటూ కృష్ణా కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు ప్రజలకు అవగాహన కల్పించారు. జాతీయ సేవా పథకం ప్రత్యేక శిబిరం సోమవారం రెల్లి వీధిలో జరిగింది. ఈ సందర్భంగా ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు సోషల్ సర్వే నిర్వహించారు. అందరూ చదువుకోవాలని ఇంటింటికీ వెళ్లి ప్రజలకు వివరించారు.

ప్రజా రవాణాతో పర్యావరణానికి మేలు


ఆర్టీసీ బస్సులో కార్యాలయానికి చేరుకుంటున్న మేయర్ హరివెంకటకుమారి


కార్యాలయానికి సైకిల్‌పై వస్తున్న జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ

దాబాగార్డెన్స్: వారంలో ఒక్కరోజు ప్రజా రవాణా వినియోగించడం ద్వారా నగర కాలుష్యాన్ని అరికట్టవచ్చని మేయర్ గొలగాని హరివెంకటకుమారి అన్నారు. సోమవారం ఆమె తన క్యాంప్ ఆఫీస్ నుంచి జీవీఎంసీ కార్యాలయానికి ఏపీఎస్ ఆర్టీసీ బస్సులో చేరుకోగా.. జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ తన బంగ్లా నుంచి సైకిల్‌పై కార్యాలయానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నగరంలో కాలుష్య నియంత్రణకు వారంలో ఒక రోజు జీవీఎంసీ ఉద్యోగులతోపాటు అందరూ ప్రజా రవాణాను వినియోగిస్తున్నామని తెలిపారు. ఎకో-వైజాగ్ అభివృద్ధి నేపథ్యంలో ఎకో జీరో పొల్యూషన్ కార్యక్రమంలో భాగంగా నగరంలో పర్యావరణ పరిరక్షణకు, కాలుష్య నియంత్రణకు జీవీఎంసీ అనేక అవగాహన చర్యలు చేపడుతోందన్నారు. కాలుష్య నియంత్రణకు ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలు, కళాశాలల యాజమాన్యం, పారిశ్రామిక యాజమాన్యాలు, స్వచ్ఛంద సంస్థలు, నగర ప్రజలు సహకరించి వారంలో ఒకరోజు ప్రజా రవాణా వ్యవస్థ వినియోగించాలని విజ్ఞప్తి చేశారు.

బుద్దిస్ట్ సొసైటీ కేంద్ర కమిటీ ఎన్నిక


ఎన్నికైన నూతన కమిటీ సభ్యులు

సీతంపేట: ది బుద్దిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా(టీబీసీఐ) 11వ బౌద్ధ సమ్మేళనం రెండో రోజు కార్యక్రమంలో భాగంగా సోమవారం స్థానిక అంబేడ్కర్ భవన్‌లో నూతన కేంద్ర కమిటీ ఎన్నిక జరిగింది. కమిటీ ట్రస్టీ జాతీయ అధ్యక్షుడిగా చంద్ర బోధిపాటిల్, ప్రధాన కార్యదర్శిగా బి.కె.బరేవ్, కోశాధికారిగా శంకరరావు దొంగేరే ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యవర్గంలో మిగతా వారిని త్వరలో ఎన్నుకోనున్నారు. భారత రాజ్యాంగ నిర్మాత బి.ఆర్.అంబేడ్కర్ కలలుగన్న ప్రబుద్ధ భారత్ నిర్మాణం కోసం కొత్త కమిటీ కృషి చేస్తుందని, బుద్ధుడి సిద్ధాంతాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లనుందని ప్రతినిధులు తెలిపారు.

దృఢ సంకల్పంతో విధులు నిర్వర్తించాలి

- అనకాపల్లి ఎస్పీ కె.వి.మురళీకృష్ణ


ఏఆర్ పోలీస్ మైదానంలో డాగ్ స్క్వాడ్ శిక్షకుడికి సర్టిఫికెట్ అందజేస్తున్న ఎస్పీ మురళీకృష్ణ

ఆరిలోవ: రానున్న ఎన్నికల్లో పోలీసులు దృఢ సంకల్పంతో విధులు నిర్వర్తించాలని అనకాపల్లి ఎస్పీ కె.వి మురళీకృష్ణ తెలిపారు. విశాలాక్షినగర్ ఏఆర్ పోలీస్ మైదానంలో సోమవారం జరిగిన మొబలైజేషన్ ముగింపు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిబ్బంది ఆయనకు కవాతుతో ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వృత్తిపరమైన, వ్యక్తిగత క్రమశిక్షణతో పోలీసులు విధులు నిర్వహించాలన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా జరగడానికి పోలీసులు కృషి చేయాలన్నారు. చెక్ పోస్టుల వద్ద పటిష్టమైన బందోబస్తు నిర్వహించాలని అధికారులను ఆయన ఆదేశించారు. ఇటీవల విజయవాడలో జరిగిన 32వ ఆర్సీ కోర్సులో మత్తు పదార్థాలను గుర్తించడంలో మొదటి బహుమతి పొందిన అల్లూరి సీతారామరాజు జిల్లా పోలీస్ విభాగానికి చెందిన రాకీ(జాగిలం), పేలుడు పదార్థాలను గుర్తించి రెండో స్థానంలో నిలిచిన అనకాపల్లి జిల్లాకు చెందిన వోల్గా(జాగిలం) శిక్షకులను అభినందించారు. అదనపు ఎస్పీలు బి.విజయభాస్కర్, పి.సత్యనారాయణ, వి.సత్తిబాబు, డీఎస్పీ పి.నాగేశ్వరరావు, ఆర్ఐలు సతీష్, అరవింద్, కిశోర్, వెంకటరావు, మన్మధరావు పాల్గొన్నారు.

నేడు కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన

దాబాగార్డెన్స్: బురుజుపేటలో కొలువైన కనకమహాలక్ష్మికి 108 స్వర్ణ పుష్పాలతో మంగళవారం అష్టదళ పద్మారాధన నిర్వహించనున్నారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు జరిగే ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలచే భక్తులు రూ.1,116 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలి. యూనియన్ బ్యాంక్ అకౌంట్ నంబర్ 060810011006681 టౌన్‌కొత్తరోడ్డు బ్రాంచ్, ఐఎఫ్‌ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806081కు ఆన్‌లైన్ పేమెంట్ చేసి, పేరు, గోత్రం తెలిపితే వారి పేరిట పూజ చేస్తారు. వివరాలకు 0891-2711725, 2566514 నంబర్లలో సంప్రదించవచ్చు.

యువతతోనే అభివృద్ధి భారత్ సాధ్యం



విద్యార్థులకు సర్టిఫికెట్లు ప్రదానం చేస్తున్న ఎంపీ జీవీఎల్ నరసింహారావు ఏయూ రిజిస్ట్రార్ జేమ్స్ స్టీఫెన్

ఏయూక్యాంపస్: భారతదేశం 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా అవతరించడంలో యువత పాత్ర కీలకమని ఎంపీ జీవీఎల్ నరసింహారావు అన్నారు. ఏయూ జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో సోమవారం టి.ఎల్.ఎన్ సభా మందిరంలో నిర్వహించిన యువ సంవాద్ సమావేశం ముగింపు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. విజేతలకు సర్టిఫికెట్లు ప్రదానం చేసి మాట్లాడారు. దేశం ప్రథమం అనే విధంగా యువత నడచుకోవాలన్నారు. రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్ మాట్లాడుతూ నాక్ గ్రేడింగ్‌లో ఏయూ అత్యుత్తమ స్థానం సాధించడంలో ఎన్‌ఎస్‌ఎస్ కార్యక్రమాలు, సేవలు ఉపయోగపడ్డాయన్నారు. ఉదయం జరిగిన ప్రారంభోత్సవంలో మాజీ ఎమ్మెల్సీ మాధవ్ మాట్లాడుతూ యువత దేశం కోసం కలలు కనాలని, వాటిని సాకారం చేసే దిశగా పనిచేయాలన్నారు. బీజేపీ రాష్ట్ర కార్యదర్శి సురేంద్ర మోహన్ మాట్లాడుతూ ప్రధాని మోదీ సూచించిన పంచ్‌ప్రాణ్ సూత్రాలను అంతా పాటిస్తూ వికసిత్ భారత్‌ను ఆవిష్కరించాలన్నారు. ఏయూ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య కె.శ్రీనివాసరావు మాట్లాడుతూ పౌరులు బాధ్యతాయుత ప్రవర్తన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో భాగంగా వర్సిటీ స్థాయిలో పంచ్ ప్రాణ్‌పై నిర్వహించిన వక్తృత్వ పోటీల్లో 30 మంది యువతీ యువకులు పాల్గొని తమ భావాలను, ఆలోచనలను పంచుకున్నారు. వక్తృత్వ పోటీలకు న్యాయనిర్ణేతలుగా వ్యవహరించిన డాక్టర్ పి.ఉమామహేశ్వరరావు, ఇ.వి.ఎస్ భాగ్యలక్ష్మి, వై.అనసూయ దేవిలను సత్కరించారు. ఎన్‌ఎస్‌ఎస్ సమన్వయకర్త ఆచార్య ఎస్.హరనాథ్, సైన్స్ కళాశాల ప్రోగ్రాం అధికారి డాక్టర్ సి.హెచ్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

విజేతలు వీరే..

వక్తృత్వ పోటీల్లో డి.హర్షిత(న్యాయ కళాశాల), రేవతి(సెయింటాన్స్), భవిత(యూ ఫార్మసీ), కె.యామిని(సెయింటాన్స్), శ్రీకాంత్ రెడ్డి(ఏయూ సైన్స్ కళాశాల), జి.హర్షితా రాణి(సెయింటాన్స్) విజేతలుగా నిలిచారు.